# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### పైరవీకారులదే రాజ్యం..

గతంల కాంగ్రెస్ పాలించినప్పుడు భూమి పట్టా పాసు బుక్కులు, పహనీలు కావాలంటే, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుండె. పట్వారీలకు పైసలు ఇస్తేనే పనులు జరుగుతుండె. కాంగ్రెస్‌కు ఓటేస్తే ధరణిని తీసేసి, భూమాత తీసుకస్తామని అంటున్నరు. అట్లయితే మళ్లీ పైరవీకారుల రాజ్యమొస్తది. కాంగ్రెసోళ్లు ఇప్పుడు రెవెన్యూ రికార్డుల్లో కొలుదా రు, అనుభవ దారు కాలమ్ పెడతామంటున్నరు. అదే జరిగితే రైతుల బతుకులు ఆగమాగమైతయ్. ప్రస్తుత ధరణితో మా భూములకు భద్రత వచ్చింది. సర్వే నంబర్ల సా యంతో ఇప్పుడు మా భూ ములను మొబైల్లోనే చూసుకుంటున్నం. భూమాత పోర్టల్‌పై మాకు నమ్మకం లేదు. మళ్లీ కాంగ్రెసోళ్లు కొత్త రూల్స్ పెడుతరు. మా కు మళ్లీ కష్టాలు వస్తయ్. బీఆర్ఎస్ ప్రభు త్వం అమలు చేస్తున్న రైతుబంధుతో మాకు పంట పెట్టుబడి సాయం అందుతున్నది. కాంగ్రెస్ ఆట లు ఇక్కడ సాగవు. వాళ్లు వచ్చేది లేదు.. సచ్చేది లేదు.

**- నేరెళ్ల శంకర్‌రెడ్డి, రైతు, బండలింగాపూర్**



### వాళ్లిష్టమా..? ఇక్కడ అవన్నీ నడువయ్

కాంగ్రెస్ వాళ్లు చాలా కథలు పడుతున్నరు. ధరణిని తీసేస్తామంటున్నరు. అంటే వాళ్ల ఇష్టమా..? అవన్నీ ఇక్కడ నడువయ్. ధరణి తీస్తే చాలా ఘోరాలు జరుగుతయ్. భూ తగాదాలు ఏర్పడుతయ్, లంచగొండితనం పెరుగతది. పట్వారీల చుట్టూ, తహసీల్దార్ చుట్టూ తిరుగుడే అయితది. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ధరణి సక్కగుంది. రైతుకు తన భూమిని ఎవరు అక్రమంగా రికార్డులో మార్చకుండా, మరొకరు ఆక్రమించకుండా ఒక భద్రతను కల్పించింది ధరణి. కౌల్దారు ఒప్పంద చట్టం తేవాలనడం మంచిది కాదు. ఎందుకం టే భూమి యజమానికి, కౌల్దార్‌కు మధ్య లొల్లులు జరుగుతాయి. ధరణే ముద్దు, పాత రెవెన్యూ విధానం మాకు వద్దు.

**- ముస్కురి రాజావ్, రైతు, బండలింగాపూర్**



### ❖ ధరణి వద్దంటే దరిద్రం కొని తెచ్చుకున్నట్టే



ధరణి రాకముందు భూమి అమ్ముదామన్నా.. కొందామన్నా తీవ్ర ఇబ్బందులు ఉండేటివి. ధరణి వచ్చినంక ఆ సమస్యలు అస్సలు లేవు. భూమి అమ్మినా నిమిషం వ్యవధిలోనే పని అవుతున్నది. కొన్నా అంతే టైం పడు తంది. గతంల భూమి అమ్మినా.. కొన్నా పాస్ పుస్తకాల్లో నెలల తరబడి తిరిగినా మార్పులు జరగలే. దీంతో భూ యాజమాని ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి అమ్మెటోళ్లు. ఇప్పుడు భూమి అమ్మినప్పుడు అప్పటికప్పుడే పట్టాలో వారి పేర్ల స్థానంలో కొన్నవారి పేర్లు వస్తుండటంతో అవకతవకలు జరుగడం లేదు. ఇదంతా ధరణి మూలంగానే అయింది. ధరణిని తీసివేస్తామనే కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఆ పార్టీ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

**- అంబటి వెంకటేశ్ యాదవ్ రైతు, సంకేనపల్లి(వెల్గటూర్)**

### ❖ దరిద్రమే తప్ప లాభం లేదు..



ధరణి వల్ల భూ రికార్డులకు భద్రత, రైతులకు భరోసా కలిగింది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చినంక ధరణి తీసేస్తమని, బంగాళాఖాతంలో వేస్తమని అంటున్నరు. మళ్లీ పాత రెవెన్యూ విధానం అమలు చేస్తామని అంటున్నారు. ఆ పని చేస్తే దరిద్రమే తప్ప ఇంకొకటి ఉండదు. పైసా లంచం ఇవ్వకుండా జాప్యం లేకుం డా ధరణితో భూముల రిజిస్ట్రేషన్, భూ యజమానుల బదలాయింపు, విరాసత్, మ్యుటేషన్ వంటివి ఎంతో సులువుగా అయితున్నయి. ధరణి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో భూమి రికార్డులు నిర్వహణ తీరు అధ్వానంగా ఉండేది. లంచాలు ఇస్తేగానీ పనులు జరిగేది కాదు. రైతులకు మేలు చేసే ప్రభుత్వమే మాకు కావాలి. తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ రైతులకు అనేక పథకాలు పెట్టి మేలు చేసిండు. ఆగమై పొరపాటు చేసుకోం మాకు మేలు చేసే ప్రభుత్వానికే మద్దతిస్తాం.

**- ఇట్టెడి భూమారెడ్డి, రైతు, బండలింగాపూర్ (మెట్‌పల్లి)**

# మమ్మల్ని ముంచే కుట్ర

- మళ్లీ పాత పద్ధతితో ఆగం చేస్తరా
- పైరవీకారుల రాజ్యం తెస్తరా..
- ధరణిని రద్దు చేస్తే మళ్లీ గెట్ల పంచాయితీలే
- తాకులాటలు పెట్టే వాళ్లను తరిమి కొడుతం
- ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్‌ను రానివ్వం
- భూములను కాపాడే బీఆర్ఎస్‌కే మద్దతిస్తం
- స్పష్టం చేస్తున్న రైతులు

జగిత్యాల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): నాడు భూముల గొడవలు అన్నీ ఇన్నీ కావు.. అధికారులు చేసిన నిర్వాకానికి పాలోళ్ల మధ్య గెట్టు పంచాయితీలు.. అన్నదమ్ముల మధ్య కొట్లాటలు.. ఒకరి పేరు బదులు మరొకరి పేరు తప్పు రాస్తే దాన్ని సరిదిద్దుకోడానికి ఏండ్లకాలంగా అధికారుల చుట్టూ తిరిగేది. ఒక్క తిరుగుడే కాదు.. వాళ్లడిగినన్ని పైసలు ముట్టజెప్పనిదే ఫైలు ముంగటికి పోకపోయేది.. ఈ మధ్యల పైరవీకారులు బతికేది.. చేతిల ఇన్ని పైసలుండి కొంత భూమి కొందామనుకునేటోళ్లకు చుక్కలు చూపించేది. రిజిస్ట్రేషన్ చేసుకోడానికి రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గర రోజంతా పడిగాపులు పడేది.. అక్కడ ఎంతో కొంత ముట్ట చెప్పనిదే పని కాకపోయేది. పేపర్లు చేతికచ్చినంక మ్యుటేషన్‌కనీ తాసిల్దార్ ఆఫీసుకు పోతే అక్కడా నెలల తరబడి తిప్పుకునేది.. వీఆర్వోలు ఆ పేపర్ లేదు.. ఈ పేపర్ లేదు.. పేరు తప్పు పడ్డది.. అంటూ ముప్పుతిప్పలు పెట్టేది. చివరికి అన్ని పేపర్లు సరిచేసుకుని పట్టుకెళ్తే తప్పిచ్చుక తిరిగేది.. చివరికి ఎంతో కొంత ముట్టజెప్తే కానీ పనిచేయకపోయేది. పహణీలల్ల పేర్లు మార్చి ఇబ్బందులు పెట్టేది.. పాసుబుక్కులల్ల తీరొక్క కాలాలతో పట్టాదారుడికి.. కౌలుదారులకు తాకులాటలు ఉండేటివి.. ఇట్ల ఏండ్లకాలంగా కోర్టుల చుట్టూ తిరిగేది. గిట్ల రైతులను అరిగోస పెట్టిన దరిద్రపు వ్యవస్థ ధరణి రావడంతో పీడ విరగడైంది. ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించింది. భూములకు భద్రత లభించింది. ఒకరి భూమి మరొకరికి పోదన్న నమ్మకం కలిగింది. ఎక్కడి నుంచైనా తన పేరును భూమి ఉన్నదో లేదో చూసుకునే అవకాశం వచ్చింది. ఇంత మంచి ధరణిని కాంగ్రెస్ వస్తే రద్దు చేస్తామంటుండడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత పద్ధతి వస్తే మళ్లీ గెట్టు పంచాయితీలు జరుగుతాయని, తాకులాటలు పెట్టే వాళ్లను తరిమి కొడుతామని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదని, అట్లాంటి పార్టీని రానివ్వమని, భూములను కాపాడే బీఆర్ఎస్‌కే మద్దతిస్తామని స్పష్టం చేస్తున్నారు.



### ❖ దళారుల రాజ్యమస్తది

కాంగ్రెస్ ధరణిని రద్దు చేసి పాత పటేల్, పట్వారి వ్యవస్థ తెస్తమంటున్రు. భూముల సమస్యలు తీరలేక అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్లో వీఆర్వోల వెంబడి ఎమ్మార్వోల వెంబడి తిరిగినం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక ధరణి తీసుకురావడంతో, రైతుల బాధలు తప్పినవి. కాంగ్రెస్ గవర్నమెంట్లో వీఆర్వోల దగ్గరకు తిరగడనికే బతుకులు సరిపోయినయి. ఇప్పుడు రైతులు ప్రశాంతంగా ఉంటున్రు. గప్పటి పరిస్థితి మళ్లీ వస్తే భూముల పట్టాలు ఆగమైతయి. దళారులు పుట్టుకొచ్చి వారే రాజ్యమేలుతరు. పంచాయితీలు పెట్టడానికి కాంగ్రెస్‌కు ఓటు వేయాలా? అప్పట్లో రిజిస్ట్రేషన్ దగ్గర లంచం ఇచ్చే పరిస్థితి ఉండేది. వీఆర్వోలకు, ఎమ్మార్వోలకు పైసలు ఇవ్వకుంటే పట్టా అయ్యేది కాదు. వీఆర్వోలు, ఎమ్మార్వోల దయ మీద ఆధారపడేటోళ్లం. మళ్లీ ఆ వ్యవస్థ రానివ్వం. కేసీఆర్‌కే మా మద్దతిస్తం.

**-లాండెరి లింగన్న, రైతు ఇబ్రహీంపట్నం**

### ❖ జుట్లు.. జుట్లు ముడేసి లొల్లివెడుతరా..?



నాకు కొంత వ్యవసాయ భూమి ఉంది. రికార్డుల ప్రకారం రైతు బంధు వస్తంది. ధరణి వచ్చినంక పట్టా చేసుకోవడం ఈజీ ఐంది. ధరణితో రికార్డులు భద్రంగున్నయ్. భూముల ధరలు భారీగా పెరిగినయ్. అధికారుల మోసాలు తగ్గినయ్. అమ్మినా, కొన్నా సులభంగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయి. ధరణి ఎత్తేస్తే ఏ రైతు భూమి ఎవరికి ఉందో తెలియదు. ఇంత మంచి ధరణిని కాంగ్రెస్ రద్దు చేస్తామంటంది. అట్ల చేస్తే రైతులు అరిగోస పడుతరు. మళ్లీ పాత పద్ధతి తెస్తే పైరవీకారులు పుట్టుకొస్తరు. లంచాలు పెరుగుతయ్.. ఒకరి భూమి మరొకరికి రాసి గొడవలు పెడుతరు. జుట్లు.. జుట్లు ముడేసి గెట్ల తాకులాటలు పెట్టే కాంగ్రెస్‌ను తరిమి కొడుతం. మా జోలికి రావద్దు.

**- గూడకోరుట్ల అనంతరెడ్డి, రైతు ఇబ్రహీంపట్నం**

### ❖ ధరణిని తీసేస్తే దోపిడే!



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తరట, అదే గనుక జరిగితే మళ్లీ దళారి రాజ్యం వస్తది. రికార్డుల్లో భూముల వివరాలను ఇష్టమొచ్చినట్టుగా నమోదు చేస్తారు. భూతగాదాలు ఎక్కువవుతాయి. ధరణి వచ్చినంక రైతులకు భరోసా ఏర్పడింది. ఇంకొకరు తమ భూ రికార్డుల్లో వేలుపెట్టకుండా భద్రతను ప్రభుత్వం కల్పించింది. సక్కగా ఉన్న ధరణిని తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లోనే బొందపెట్టాలి. పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దు. రైతులకు మేలు చేసే బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి. ధరణిని కాపాడుకుని మన భూములకు రక్షణ పొందాలి.

**- రాదారపు ఆనందం, రైతు, వేములకుర్తి**

### ❖ కాంగ్రెస్ అచ్చేది లేదు..సచ్చేది లేదు



ధరణిని రద్దు చేసి మరొకటి తెస్తాం. మూడు గంటలే కరెంటు ఇస్తమంటూ అధికారంలోకి రాక ముందే కాంగ్రెసోళ్లు భయపెడుతున్రు. తొమ్మిదేండ్ల సంది వ్యవసాయానికి మంచి కరెంటు వస్తుంది. ధరణివల్ల రిజిస్ట్రేషన్లు అలుకగా అయితున్నవి. గతంలో ఆర్ఓఆర్ కోసం పట్వారీలు, కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ఆర్ఓఆర్ చేసేందుకు వేలకువేలు డబ్బులు ఖర్చు అయ్యేటిది. ధరణి వచ్చినంక రైతుల భూములకు భద్రత దొరికింది. సీఎం కేసీఆర్ సార్ ధరణిని పెట్టి మంచి పనిచేసిన్రు. పొరపాటున కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాదు. వచ్చినా ధరణిని రద్దు చేస్తామంటే ఊరుకునేది లేదు.

**- అద్యాల రెడ్డి, రైతు, వేములకుర్తి**